# పేరుకుపోతున్న 'ధరణి' సమస్యలు

**ఇబ్బందులు పడుతున్న రైతులు**

వరంగల్ ఆర్డీవో కార్యాలయం

ఖిలావరంగల్, జూలై 12: వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో రోజురోజుకు ధరణి పోర్టల్ సమస్యలు పేరిపోతున్నాయి. పరిష్కారానికి నోచుకోక రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం సమీక్షలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తున్నా వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఆర్డీవోగా విధులు నిర్వర్తించిన సిడాం దత్తును అవినీతి, అక్రమాల కేసులో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని మంచిర్యాలకు తరలించారు. దీంతో ఇన్‌చార్జిగా నర్సంపేట ఆర్డీవోకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కానీ, డిజిటల్ కీ ఇవ్వకపోవడంతో ధరణి మినహా చిన్నాచితక పనులు మాత్రమే జరుగుతున్నాయి. సామాన్య ప్రజలు, రైతులు హనుమకొండలో ఉన్న వరంగల్ కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సమస్యకు ఎప్పుడు పరిష్కారం దొరుకుతుందోనని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జి ఆర్డీవోకు డిజటల్ కీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బీరన్నస్వామి బోనాలకు వేళాయె

**17న తొలి ఏకాదశి సందర్భంగా జరుగనున్న వేడుకలు**

బీరన్నకుంటలోని ఆలయాలు

కరీమాబాద్, జూలై 14: ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట ప్రాంతాల్లో ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా బోనాల వేడుకలు కనుల పండువగా జరుగనున్నాయి. కరీమాబాద్‌లోని కురుమ కులస్తులు బుధవారం ఉదయం బీరన్న స్వామికి అభిషేకం చేస్తారు. అనంతరం కురుమ సంఘం కార్యాలయం నుంచి మూడు రంగుల జెండాను పురవీధుల గుండా ఊరేగించి ఆలయంలోని దైవ చెట్టుకు జెండాను కడతారు. తర్వాత కురుమల డోలు వాయిద్యాలు కొడుతూ గడపగడపకూ వెళ్లి బండారిని నుదట బొటుగా పెట్టి బోనాలు సిద్ధం చేయాలని సూచిస్తారు. మొదట రామస్వామి ఆలయం వద్ద కులపెద్ద నెత్తిన బండారి, బోనాలతో నిలిచి ఉంటాడు. బీరన్నలు కురుమ డోలుతో తలోదిక్కుకు బయల్దేరి కురుమలను ఇంటి వద్ద నుంచి డోలు వాయిద్యాలతో తీసుకొస్తారు. ఇలా అందరూ రామస్వామి గుడి వద్దకు చేరుకుంటారు. అలాగే, రంగశాయిపేటకు చెందిన కురుమ కులస్తులు ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసి అభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుంటారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారు. ఈ సందర్భంగా కరీమాబాద్ బీరన్నస్వామి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోరె నాగరాజు మాట్లాడుతూ తొలి ఏకాదశి రోజు బీరన్నస్వామి బోనాలు చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారమన్నారు. కార్పొరేటర్ పల్లం పద్మ మాట్లాడుతూ తమ డివిజన్‌లో బీరన్నస్వామి ఆలయం ఉండడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.

# కమిషనరేట్‌లో డ్రగ్స్ కంట్రోల్ టీం: సీపీ

సుబేదారి, జూలై 14: మత్తు పదార్థాల నియంత్రణ కోసం వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో డ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కాకుండా గంజాయి ఇతర మత్తు పదార్థాలను నియంత్రించడానికి ఈ డ్రగ్స్ టీం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, సేవించే ప్రాంతాలపై ఈ టీం నిఘా పెట్టి, ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించిన వెంటనే 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తులకు నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. గంజాయి రహిత పోలీసు కమిషనరేట్ కోసం అందరూ కృషిచేయాలని సీపీ ఒక ప్రకటనలో కోరారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

గీసుగొండ, జూలై 14: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1989-90 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు పాఠశాలలో కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు కుటుంబ వ్యవహారాలు, మంచి చెడులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. పాఠశాలకు రూ. 10 వేల విలువైన బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో నాటి హెచ్ఎం గుడిపూరి సత్యనారాయణరావు, ఉపాధ్యాయులు సయ్యద్ అలీ అక్బర్, కందుకూరి దేవేంద్రాచారి, కే రమణాచారి, తాడ మోహన్‌రెడ్డి, ప్రస్తుత హెచ్ఎం మిడివెల్లి పట్టాభి పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు కే రామ్మూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

**TOURS & TRAVELS**

★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

**PLOT FOR SALE**
★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

# పట్టణ ప్రగతి నిధులు కట్

- గత ప్రభుత్వంలో ప్రతి నెలా విడుదల
- కాంగ్రెస్ హయాంలో నిధుల నిలిపివేత
- బిల్లుల చెల్లింపులూ లేవు

వరంగల్, జూలై 14: పట్టణాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమం నిధులకు కాంగ్రెస్ ప్రభుత్వం బ్రేక్‌లు వేసింది. 2020 ఫిబ్రవరి నెలలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించిన కేసీఆర్ ప్రభుత్వం ప్రతి నెలా క్రమం తప్పకుండా 2023 ఎన్నికల కోడ్ వచ్చే వరకూ గ్రేటర్ కార్పొరేషన్‌కు నిధులను విడుదల చేసింది. పట్టణ ప్రగతిలో భాగంగా డివిజన్లలో పర్యటించిన ప్రజాప్రతినిధులు సమస్యలను గుర్తించి, పట్టణ ప్రగతి నిధులతో అభివృద్ధి పనులను చేపట్టారు. తొలుత ప్రతి నెల రూ.7 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు నిధులు విడుదల చేశారు. ఏటా పట్టణ ప్రగతి ద్వారా గ్రేటర్‌కు సుమారు రూ.40 కోట్ల నిధులు వచ్చేవి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టణ ప్రగతి నిధులను నిలిపివేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రగతి కింద పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. మరికొన్ని పనులు మధ్యలో ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం పట్టణ ప్రగతి నిధులు విడుదల చేస్తుందా? లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

**నయా పైసా విడుదల చేయలేదు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నయా పైసా కూడా పట్టణ ప్రగతి కోసం నిధులు విడుదల చేయలేదు. దీంతో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రతి నెలా వచ్చే నిధులను నిలిపివేయడంతో నగర అభివృద్ధికి బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ నాటి నుంచి ఇప్పటి వరకూ పట్టణ ప్రగతి నిధులు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, సుమారు 8 నెలలు అవుతున్నా నిధులకు మోక్షం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఒక్క గ్రేటర్ కార్పొరేషన్‌కే పట్టణ ప్రగతి ద్వారా రూ.128.85 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇందులో గ్రేటర్ అధికారులు రూ.182.42 కోట్ల పనులకు మంజూరు ఇచ్చారు. ఇప్పటికే రూ. 136 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో పట్టణ ప్రగతి పనుల బిల్లుల రాక కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు 14వ ఆర్థిక సంఘం నిధులను కలుపుకొని జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం గ్రేటర్‌కు నిధులను విడుదల చేసింది. ఈ పథకం ప్రారంభమైన ఏడాది వరకు గ్రేటర్‌కు ప్రతి నెల రూ.7.34 కోట్ల నిధులు వచ్చాయి. తర్వాత కొద్దిగా నిధుల మొత్తాన్ని తగ్గిస్తూ క్రమం తప్పకుండా ప్రతి నెలా విడుదల చేశారు.

**రూ. 12 కోట్ల పెండింగ్ బిల్లులు**

పట్టణ ప్రగతి పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.12 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదిగా పట్టణ ప్రగతి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో చిన్నచిన్న కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి నెలా నిధులు విడుదలైనందున కాంట్రాక్టర్లు పనులను చేసేందుకు పోటీలు పడ్డారు. ప్రభుత్వం మారి ఒక్కసారిగా నిధుల విడుదల నిలిచిపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. పట్టణ ప్రగతి పథకం ద్వారా కాలనీలలో రోడ్లు, డ్రైడేజీలు, శ్మశాన వాటికలు, పార్కులను అభివృద్ధి చేశారు. పట్టణ ప్రగతి నిధులతోనే గ్రేటర్‌లో వెయ్యి సీట్ల పబ్లిక్ టాయ్‌లెట్లను నిర్మించారు. గ్రేటర్ మొత్తంగా 591 అభివృద్ధి పనులను చేపట్టారు. దీనిలో 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధులను నిలిపివేయడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు ఎలా చెల్లించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వరంగల్ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

# చినుకుపడితే చిత్తడే..

నర్సంపేట, జూలై 14: నర్సంపేట పట్టణంలోని రోడ్లు చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల పక్కన వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట పిచ్చి మొక్కలు పెరిగాయి. డ్రైనేజీలు సరిగా లేక వర్షాపునీరు రోడ్ల పక్కనే నిలుస్తున్నది. అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో వర్షపునీరు నిలిచి కంటను తలపిస్తున్నది. పక్క నుంచి వాహనాలు వెళ్తే నీరంతా దుస్తులపైన పడుతున్నదని పాదాచారులు, సైకిలిస్టులు అంటున్నారు. ప్రమాదకరంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సంప్రదాయ దుస్తుల్లోనే అమ్మవారిని దర్శించుకోవాలి

వరంగల్, జూలై 14: నగరంలోని భద్రకాళీ అమ్మవారిని దర్శించుకునే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఈవో శేషుభారతి తెలిపారు. ఇటీవల అమ్మాయిలు ఫ్యాషన్‌గా జుట్టు విరబోసుకుని అమ్మవారి దర్శనానికి వస్తున్నారని, అలా రాకుడదని తెలిపారు. అమ్మాయిలు లంగావోణి ధరించి, సాంప్రదాయంగా జడ వేసుకోవాలని, కనీసం జుట్టుకు రబ్బర్ బాండ్ పెట్టుకుని రావాలని సూచించారు.

# తండ్రి మందలించాడని విద్యార్థిని ఆత్మహత్య

ఖానాపురం, జూలై 14: తండ్రి మందలించాడని మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బండమీదిమామిడితండాలో ఆదివారం జరిగింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. బండమీదిమామిడితండాకు చెందిన ధరావత్ కల్యాణి(19) నర్సంపేటలోని హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కళాశాలలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతున్నది. అపెంట్రిస్‌లో భాగంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. 15 రోజుల నుంచి కళాశాలకు వెళ్లకపోవడంతో తండ్రి భద్రు ప్రశ్నించగా.. తాను హాస్టల్‌లో ఉండలేనని, ఇంటి నుంచే కళాశాలకు వెళ్తానని చెప్పింది. దీంతో తండ్రి హాస్టల్‌లోనే ఉండి చదువుకోవాలని మందలించాడు. ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్యాణి క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన ఇరుగుపొరుగు వారు తల్లిదండ్రులకు తెలియజేసి ఆమెను నర్సంపేటలోని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పౌరహక్కుల నేత డాక్టర్ రామనాథం సతీమణి మృతి

కాశీబుగ్గ, జూలై 14: వరంగల్ నగరానికి చెందిన పౌరహక్కుల రాష్ట్ర నాయకుడు దివంగత డాక్టర్ రామనాథం సతీమణి లక్ష్మి(87) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మట్టెవాడ గోపాలస్వామి ఆలయ ప్రాంతంలోని ఆమె నివాసానికి ఆదివారం పలువురు పౌరహక్కుల నేతలు చేరుకొని లక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుమారు 35 ఏళ్ల క్రితం డాక్టర్ రామనాథం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే.

సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

# నేడు జగన్నాథ రథయాత్ర

కాశీబుగ్గ, జూలై 14: ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం వరంగల్‌లో జగన్నాథుడి రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ టెంపుల్ కోర్డినేటర్ దమేశ్వర ధర్మేంద్రదాస్, భూపావన హరినామా దాస్ అన్నారు. ఆదివారం 3వ డివిజన్ ఆరెపల్లిలోని ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి రథయాత్ర ప్రారంభమై హనుమకొండ చౌరస్తా మీదుగా ములుగురోడ్డు జంక్షన్, ఎంజీఎం, పోచమ్మమైదాన్ జంక్షన్ల మీదుగా వెంకటేశ్వర గార్డెన్స్‌కు చేరుకుంటుందని తెలిపారు. రథయాత్రలో వరంగల్ ప్రజలతో పాటు ఇస్కాన్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ

కాశీబుగ్గ, జూలై 14: వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫేషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, మెపా రాష్ట్ర కార్యదర్శులు సంగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, నీరటి రాజు, అమ్మగారి శ్యామ్, ఏ రాజు పాల్గొన్నారు.

# కోటలో యోగాసనాలు

ఖిలావరంగల్, జూలై 14: చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లు కోటలో ఆదివారం యోగా గురువు పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువత యోగాసనాలు వేశారు. యోగా వల్ల దీర్ఘకాలిక రుగ్మతలైన బీపీ, షుగర్, అల్సర్, ఆస్తమా తదితర నొప్పుల నుంచి ఉపశమనం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వేణు, శ్రీకాంత్, మమత, లిఖిత, రాజయ్య, హయగ్రీవాచారి పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న యువత

# హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

వర్ధన్నపేట, జూలై 14: సినిమా థియేటర్‌లో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న వర్ధన్నపేట సినిమా థియేటర్‌లో కళ్లెం విజయ్(19) స్నేహితులతో కలిసి సినిమా చూస్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామానికి చెందిన ఊర కృష్ణ(36) విజయ్‌పై కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆదివారం కృష్ణను ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కళ్లెం విజయ్ వర్ధన్నపేటలో ఇనుప సామను దుకాణంలో పని చేస్తున్నాడు. ఇల్లందకు చెందిన కృష్ణ కుమార్తెను అతడు ప్రేమిస్తున్నాడనే విషయాన్ని మనసులో పెట్టుకొని అదును చూసి దాడి చేసినట్లు తెలిసింది.

మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సంద్ర సుధీర్

# 'విద్యార్థులకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు'

నర్సంపేట, జూలై 14: సెల్‌ఫోన్ల వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో అనేక రుగ్మతలకు గురవుతున్నారని, తల్లిదండ్రులు పిల్లలకు అలవాటు చేయొద్దని ప్రముఖ్య సైకాలజిస్ట్ సంద్ర సుధీర్ సూచించారు. నర్సంపేటలోని గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్‌పై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు సెల్‌ఫోన్లను దూరం పెడితే పిల్లలు కూడా క్రమేణ దూరంగా ఉంటారన్నారు. మొబైళ్లు, టీవీల కారణంగా విద్యార్థులు చాలా నష్టపోతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మెటా అకాడమీ ఫౌండర్ మనోజ్‌కుమార్, వేములపల్లి జయశ్రీ, గిరగాని రాహుల్‌వర్మ, రామకృష్ణ, శ్రీరాంకిరణ్, మెటా అడ్వయిజర్ విశ్వనాథం పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

ఖిలావరంగల్, జూలై 14: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి హనుమకొండ ఐడీవోసీలో రైతు భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు గమనించి నేడు కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

# భక్తులు అభిషేకంలో పాల్గొనాలి

గిర్మాజీపేట, జూలై 14: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బట్టలబజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 కళశాలు, 108 లీటర్ల ఆవు పాలతో నిర్వహించనున్న అభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి కోరారు. అభిషేకానికి రూ. 150, లక్ష పుష్పార్చనకు రూ. 101 చెల్లించాలని సూచించారు.

# నేడు బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, జూలై 14 : బల్దియా కార్యాలయంలో ఈ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కారణాల వల్ల గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇచ్చేందుకు కార్యాలయానికి రావొద్దని కోరారు.

# ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

ఖిలావరంగల్, జూలై 14: వరంగల్‌లోని లేబర్‌కాలనీకి చెందిన బాబు అనే వ్యక్తిని కులం పేరుతో దూషించిన జనార్దన్, శ్రీనుపై మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు సీఐ మల్లయ్య తెలిపారు. కాశీబుగ్గ ప్రాంతం ఓసిటీలోని ఓ స్థల వివాదంలో బాబును నిందించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, ఏసీపీ విచారణ చేపట్టినట్లు తెలిపారు.

# ఏకశిల సేవా సంఘం మహాసభ

ఖిలావరంగల్, జూలై 14: శివనగర్‌లోని ఏకశిల సేవా సంఘం 23వ మహాసభను ఆదివారం ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయ, వ్యయాలను సభ్యులు ఆమోదించారు. తర్వాత సంఘం సభ్యుల్లో ఎవరైనా చనిపోతే ఒక్కో కుటుంబానికి రూ. 35 వేలు ఇచ్చేందుకు తీర్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైట్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం రాజేశ్, కోశాధికారిగా వాసం రమేశ్ ఎన్నికయ్యారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో పిచ్చిమొక్కల మధ్య నిరుపయోగంగా ఉన్న వాహనం

# తుప్పు పడుతున్న ప్రభుత్వ వాహనం

ఖిలావరంగల్, జూలై 14: కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రభుత్వ వాహనం తుప్పు పడుతోంది. వాహనం చుట్టూ పిచ్చిమొక్కలు ఉన్నాయి. అలాగే, చెత్తాచెదారంతో నిండిపోయింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నచిన్న మరమ్మతులకు గురైన వాహనాలను రిపేరు చేయకుండా పక్కన పడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనాల ఆలనాపాలన చూడాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథాగా పోతున్నదని ప్రజలు విమర్శిస్తున్నారు.

# గుడుంబాను పట్టుకున్న పోలీసులు

బానోత్ దస్తు అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

సంగెం, జూలై 14: గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. సంగెం మండలం పుటాన్‌తండాకు బానోత్ దస్తు బైక్‌పై ఐదు లీటర్ల గుడుంబాను గాంధీనగర్‌కు తరలిస్తున్నాడు. పెట్రోలింగ్‌లో ఉన్న ఎక్సైజ్ సిబ్బందిని చూసి ఆందోళన చెందిన అతడిని ఆపి తనిఖీ చేయగా ఐదు లీటర్ల గుడుంబా లభించింది. దీంతో గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకొని బానోత్ దస్తుపై కేసు నమోదు చేసిట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై సరిత, సిబ్బంది పి.రమేశ్‌బాబు, సీహెచ్.రమేశ్‌బాబు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పీరీల ఊరేగింపు

నల్లబెల్లి, జూలై 14: మతసామరస్యానికి ప్రతీక అయిన పీరీల ఊరేగింపును మండలంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడుచెక్కలపల్లె, నల్లబెల్లి మండలకేంద్రంలో ముస్లింలు పీరీలను ఊరేగించగా. శంషాబాద్ గ్రామంలో హిందువులు కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17న మొహర్రం వేడుకలు నిర్వహించనున్నట్లు ముజావర్లు తెలిపారు.

నల్లబెల్లిలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

# నరకానికి నకళ్లు!

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- గతంలో రూ. 200 కోట్లు మంజూరు చేసిన కేసీఆర్ సర్కారు
- పనులను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- రోడ్లపై నాటు వేసి నిరసన తెలుపుతున్న ప్రజలు

గుంతలమయమైన మేడపల్లికి వెళ్లే తారురోడ్డు

నల్లబెల్లి, జూలై 14: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో తారు లేచి.. కంకర తేలి భారీ గుంతలు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల మట్టిరోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వెరచి వాహనదారులు, బాటసారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఇటుకాలపల్లి జాతీయ రహదారి నుంచి మేడపల్లి, రాంపూర్ నుంచి గోవిందాపూర్, మామిండ్లవీరయ్యపల్లె నుంచి మూడుచెక్కలపల్లె, తాటివనం నుంచి నాగరాజుపల్లె గ్రామాలకు వెళ్లాలంటే పగటిప